నేడు ప్రయివేటు విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్రంలోని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల సంయుక్త నిర్ణయం ప్రకారం ఈనెల 3న ప్రయివేట్ విద్యాసంస్థలు ఒకరోజు మూసివేసి బంద్ పాటిస్తున్నట్లు అపుస్మా ఆచంట జోన్ కార్యదర్శి కుక్కల రవికుమార్ తెలిపారు. ఈ బంద్ గురించి బుధవారం అపుస్మా ఆచంట మండల నాయకులు ఎంఇఒ-2 రాజేంద్రప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కొంతమంది అధికారులు అనుచిత చర్యలు, రుజువుల్లేని ఆరోపణలు, బలవంతపు చేరికలు, పరిహారం లేకుండా అమలుచేయడం, 12(2) అన్యాయమైన నోటీసులు, మన స్కూల్ పాలనలో జోక్యం వంటి అంశాలకు వ్యతిరేకంగా చేపట్టిన శాంతియుత నిరసనగా జరుగుతుందని తెలిపారు. ఈ మూసివేత పాఠశాల, విద్యార్థులు, సిబ్బంది హక్కులు కాపాడడం కోసమేనని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని రవికుమార్ కోరారు.

కొల్లేరు కొలిక్కి వచ్చేనా..!

జూన్17,18వ తేదీల్లో కేంద్ర సాధికార కమిటీ పర్యటన

కొల్లేరు ప్రజలు, ప్రజా సంఘాల నుంచి పెద్ద ఎత్తున వినతులు

ప్రత్యేకంగా బృందం సభ్యులను కలిసి సిపిఎం వినతి

కొల్లేరు శాశ్వత పరిష్కారం కోసం ప్రజా సంఘాలు పోరుబాట

నేడు విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం

కొల్లేరు బృందం పర్యటన (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపాలని, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కొల్లేరు ప్రజలతోపాటు, ప్రజాసంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఇటీవల కొల్లేరుపై అధ్యయనం చేసేందుకు వచ్చిన కేంద్ర సాధికార కమిటీని కలిసి వినతులు ఇవ్వడంతోపాటు, జిల్లా స్థాయిలో రౌండ్ టేబుల్ సమస్యలు నిర్వహించారు. కేంద్రం బృందం పర్యటించి వెళ్లి 15 రోజులు గడిచిపోతోంది. దీంతో కొల్లేరు సమస్యను త్వరితగతిన పరిష్కరించడంతోపాటు, అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మూడో తేదీ గురువారం విజయవాడలో రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమాశం జరగనుంది. కొల్లేరును అనుకుని, బెడ్, బెల్టు గ్రామాలు 124 ఉండగా మూడు లక్షలకుపైగా జనం నివసిస్తున్నారు. వీరందరికీ కొల్లేరే జీవనాధారం. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో చేసిన చెరువుల ధ్వంసంతో కొల్లేరు ప్రజలు రోడ్డున పడ్డ పరిస్థితి నెలకొంది. ఆ తర్వాత ఎన్నికలొచ్చినప్పుడల్లా రాజకీయ పార్టీలు కొల్లేరు ప్రజలను నమ్మించి మోసం చేయడం పరిపాటిగా మారింది. తమకు న్యాయం చేయాలంటూ కొల్లేరు ప్రజలు దశాబ్దాలుగా పోరాడుతూనే ఉన్నారు. కొల్లేరు ప్రాంతాన్ని పరిశీలించేందుకు జూన్ 17, 18వ తేదీల్లో కేంద్ర సాధికార కమిటీ కొల్లేరులో పర్యటించింది. ప్రజలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నుంచి వినతులు స్వీకరించింది. అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై వివరాలు తీసుకుంది. సాధికార కమిటీ సుప్రీంకోర్టు ఏవిధంగా ఇస్తుందో అని ప్రజల్లో ఉత్కంఠ రేపుతోంది. కొల్లేరుకు శాశ్వత పరిష్కారం లభిస్తుందా అన్న చర్చ జనాల్లో జరుగుతోంది. ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తెచ్చేందుకు ప్రజా సంఘాలన్నీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి పలు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచేందుకు సిద్ధమైంది. కొల్లేరులోని వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను అక్కడి పేదలకు పంపిణీ చేయాలని, అటవీశాఖ అధికారుల వేధింపులు, అవినీతిని అరికట్టాలని, ఐదో కాంటూరు నుంచి మూడో కాంటూరుకు కుదించాలని, కొల్లేరు గ్రామాలకు రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని పలు డిమాండ్లను ప్రజాసంఘాలు ప్రభుత్వం ముందు ఉంచేందుకు సిద్ధమయ్యాయి.

20 ఏళ్లుగా నరక యాతన

2006లో కొల్లేరు ఆపరేషన్ తర్వాత కొల్లేరు ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఉపాధి లేకుండా పోయింది. వలస పక్షుల్లా ఇతర రాష్ట్రాలకు వెళ్లి చేపల వేట చేస్తూ కడుపునింపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 1975-76లో అప్పటి వెంగళరావు ఏర్పాటు చేసిన 146 సొసైటీ పరిధిలోని 7,100 ఎకరాల్లోని చెరువులను ధ్వంసం చేయడంతో అంతా రోడ్డున పడ్డారు. చిల్లిగవ్వ ఆదాయం లేకుండా పోయింది. అంతేకాకుండా నిబంధలనకు విరుద్ధంగా 14,800 ఎకరాలు ధ్వంసం చేశారు. కనీసం పరిహారం కూడా ఇవ్వలేదు. అటవీశాఖ నిబంధనల పేరుతో రోడ్లు, తాగునీరు వంటివి సైతం సక్రమంగా అమలు చేయడం లేదు. అటవీశాఖ అధికారులు కొల్లేరు ప్రజలను తీవ్రంగా వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వీటికితోడు ఐదో కాంటూరుపైన పది కిలోమీటర్ల వరకూ సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించి మరో 89 గ్రామాలపై ఆంక్షలు విధించిన పరిస్థితి నెలకొంది. దీంతో పర్యావరణంతోపాటు, మనుషులను కూడా కాపాండంటూ కొల్లేరు ప్రజలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొల్లేరు సమస్యను సుప్రీం కోర్టుకు తీసుకెళ్లడంలో పూర్తిగా విఫలమైన పరిస్థితి. ఆ కారణంగానే 20 ఏళ్లుగా కొల్లేరు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొల్లేరు ప్రజలకు న్యాయం చేస్తామంటూ కూటమి ప్రభుత్వం చెబుతోంది. దీంతో కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపాలంటూ అన్ని తరగతుల నుంచీ మద్దతు పెరిగింది. ప్రభుత్వం మాటలకే పరిమితమవుతుందా సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తుందా చూడాల్సి ఉంది.

లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకూ పోరాటం

9న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి - సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగ కార్మికుల ఉసురు తీస్తున్న లేబర్ కోడ్‌లు రద్దు చేసేంత వరకూ పోరాటం కొనసాగిస్తామని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు అన్నారు. పరిశ్రమలు మూత, తరచూ జరుగుతున్న ప్రమాదాలతో ఉత్పత్తి రంగాలు కుదేలవుతున్నాయని ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌ల పేరుతో ఉద్యోగ, కార్మికులపై దాడి చేస్తోందని విమర్శించారు. ఉపాధి అవకాశాలు సన్నగిల్లిపోతున్నా పరిస్థితి ఏర్పడిందని యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల తొమ్మిదో తేదీన చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక యుటిఎఫ్ భవనంలో సిఐటియు జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో శ్రామికులుగా ఉన్న అన్ని తరగతుల ఉద్యోగులనూ, కార్మికులనూ రకరకాల పేర్లతో విభజించి వారికున్న హక్కులను దక్కనివ్వకుండా పాలకులు అడ్డుపడుతున్నారన్నారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, ఫిక్స్ టర్మ్ ఎంప్లాయ్ ఇలా అనేక పేర్లతో ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో లక్షల మంది కార్మికులు పని చేస్తున్నారని, వారిని పర్మినెంట్ చేయడం, వేతనాలు ఇతర సౌకర్యాలు కల్పించకుండా పాలకులు యువత కోసం పిల్లల్ని కనండి అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉన్న కార్మిక చట్టాలను కూడా సక్రమంగా అమలు చేయకుండా కార్మిక శాఖను నిర్వీర్యం చేసి ఇప్పుడు లేబర్ కోడ్‌ల పేరుతో చట్టాల్లోనే మార్పులు తీసుకొచ్చి కార్పొరేట్లకు అనుకూలమైన విధానాలను రూపొందిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో ఇటీవల పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల కారణంగా కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని, యాజమాన్యంపై చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. సంఘం పెట్టుకోవడానికి, వేతనాలు పెంచుకోవడానికి పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. యోగా కోసం వందల కోట్లు వెచ్చించిన ప్రభుత్వం ఉత్పత్తి రంగం అభివృద్ధి చేయడానికి తద్వారా ఉపాధి కల్పించడానికి ఎంత ఖర్చు పెట్టిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చి అందరికీ ఉపాధి కల్పించాలన్నారు. కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను అనుసరిస్తూ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయడానికి జిల్లాలో ఈ నెల 3, 4, 5వ తేదీల్లో ప్రచార యాత్ర నిర్వహిస్తున్నామని, 6, 7 తేదీల్లో బైక్ ర్యాలీలు చేపట్టామని, 9వ తేదీన అన్ని మండలాల్లోనూ ర్యాలీలు, సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో బి.వాసుదేవరావు, పివి.ప్రతాప్, ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్.రంగారావు, ఎం.ఆంజనేయులు, జె.శ్రీనివాస్, డి.కళ్యాణి, అజయ్‌కుమారి, త్రిమూర్తులు, ఎం.సూరిబాబు, కె.ఝాన్సీలక్ష్మి, సిహెచ్.లక్ష్మి హసీనా సత్యనారాయణ పాల్గొన్నారు.

రొయ్యల కొనుగోలులో కాటా ట్యాపరింగ్

టన్నుకు 60 కేజీల రొయ్యలు నష్టం

జిల్లా ఫ్రాన్స్ ఫార్మర్ వెల్ఫేర్ ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు గజపతిరాజు, సుబ్బరాజు

గొల్లలకోడేరులో ఆక్వా రైతుల నిరసన



నిరసన తెలియజేస్తున్న ఫెడరేషన్ నేతలు, రైతులు

ప్రజాశక్తి - పాలకోడేరు

అనేక కష్టనష్టాలకు ఓర్చి ఆక్వా సాగు చేస్తుంటే చెరువులు పట్టుబడులకు వచ్చేసరికి కాటా ట్యాపరింగ్ చేసి రొయ్యలు కొనుగోలు చేస్తున్నారని, దీనివల్ల తీవ్రంగా నష్టపోతున్నామని ఫ్రాన్స్ ఫార్మర్ వెల్ఫేర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్.గజపతిరాజు, సుబ్బరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గొల్లలకోడేరులో ఫ్రాన్స్ ఫార్మర్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆక్వా రైతులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాటా ట్యాపరింగ్ ఏ విధంగా అవుతుందో, రైతులు ఎలా నష్టపోతున్నారో టాపరింగ్ అయిన కాటాను చూపించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గజపతిరాజు సుబ్బరాజు మాట్లాడుతూ ఇప్పటికే రొయ్య రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. ఒక పక్క గిట్టుబాటు ధర లేదని మరోవైపు వాతావరణం మార్పులు, రొయ్యలకు ప్రబలుతున్న వ్యాధులతో తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. ఈ సమయంలో ఆక్వా రైతులను కాటా మోసంతో దళారులు దోచుకుంటున్నారని విమర్శించారు. కాటా మోసం చేసి చేయడం వల్ల టన్ను రొయ్యలకు 60 కేజీలు నష్టం పోతున్నామన్నారు. రొయ్యల పట్టుబడి పట్టే సమయంలో మోసం చేసి దోచుకుంటున్న ట్రేడర్లు, కొనుగోలుదారులపై వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ వీరవాసరం అధ్యక్షులు తులసి రాంబాబు, వీరవల్లి చంద్రశేఖర్, బుజ్జి, నాని, ఈతకోట బాబి, చినబాబు, వర్మ, రైతులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతృప్తి

'సుపరిపాలన తొలిఅడుగు' కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు

గ్రామస్తులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలన పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని తిల్లపూడిలో పార్టీ శ్రేణులతో కలిసి మంత్రి ఇంటింటికి వెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను అందజేశారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు పట్ల ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ తమకు పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని, తల్లికి వందనం కింద పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికి రూ.13 వేలు చొప్పున వేశారని, ఉచిత గ్యాస్ సిలిండర్, పెంచిన పింఛను హామీ అమలు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పనితీరును ప్రజలు మెచ్చుకుంటున్నారన్నారు. వైసిపి హయాంలో పెన్షన్ వెయ్యి రూపాయల పెంపునకు ఐదేళ్లు పట్టగా, నేడు ఒకేసారి పెంచి అందజేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, డిసిఎంఎస్ ఛైర్మన్ పెంచిట్టి చంద్రమౌళి, కామిశెట్టి అయ్యప్ప నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలకు 64 స్నానాల రేవులు అనుకూలం

జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

డిఎస్‌పికి ప్రశంసాపత్రం అందజేస్తున్న జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి - నరసాపురం

గోదావరి పుష్కరాలకు జిల్లాలో 64 స్నానాల రేవులు అనుకూలమని ప్రభుత్వానికి నివేదించినట్లు జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి చెప్పారు. బుధవారం డిఎస్‌పి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పుష్కరాలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ రహదారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,400 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామన్నారు. ఇప్పటికే 400 కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో త్వరలో పెట్రోలింగ్ వాహనాలను ప్రవేశపెడుతున్నామన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. గంజాయి, దొంగ నోట్లు నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మండలంలోని నవరసపురంలో గతేడాది కోడి పందాలపై దాడి చేసి పెద్ద మొత్తంలో నగదు. కోళ్లను స్వాధీనం చేసుకున్న డీఎస్పీతో పాటు 17మంది పోలీసు సిబ్బందికి ఆయన ప్రశంసాపత్రాలను అందించారు. అడిషనల్ ఎస్‌పి భీమారావు, డిఎస్‌పి జి.శ్రీవేద, సిఐలు యాదగిరి, దుర్గాప్రసాద్, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేర నియంత్రణ సీసీ కెమెరాలు అత్యంత కీలకం

నియోజకవర్గ ప్రజలకు మెరుగైన భద్రత కల్పించే దిశగా చేపట్టిన సీసీ కెమెరాల ఏర్పాటుకు ఉదారంగా ఆర్థిక సహాయం అందించిన దాతలను ఎస్‌పి నరసాపురం డిఎస్‌పి కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో నేరాలను అరికట్టడానికి, శాంతిభద్రతలను కాపాడటానికి సీసీ కెమెరాలు అత్యంత కీలకమైనవన్నారు. నేరాల్లో ఆధారాలు సేకరించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. దాతల భాగస్వామ్యంతో నర్సాపురం నియోజకవర్గంలోని ముఖ్య కూడళ్లలో, జనావాస ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి వి.భీమారావు, డిఎస్‌పి జి.శ్రీవేద, నరసాపురం టౌన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి పాల్గొన్నారు.

కడుపు మండి రోడ్డెక్కాం

పదో రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

నరసాపురం :కార్మికులకు నోటీసులు అందిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

చాలీచాలని జీతాలతో జీవనం సాగించలేక కడుపు చేత పట్టుకుని రోడ్డెక్కామని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జెఎసి నాయకులు మద్రిపూడి సతీష్ కుమార్ తెలిపారు. సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని మున్సిపల్ ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం పదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా జెఎసి నాయకులు సతీష్ మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలతో కుటుంబాలను పోషించుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నామని, తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈరెల్లి ధనరావు, నున్న శ్రీనివాసరావు, బొడ్డు సూర్యకుమారి, దాసరి పుష్పకుమారి, కూరాకుల ప్రభావతి, ఆర్ఎస్ఎన్.మూర్తి, కోటిపల్లి రాజేష్, బాడిలంక శేషగిరి పాల్గొన్నారు.

నరసాపురం : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె పదో రోజుకు చేరింది. గతకొద్ది రోజులుగా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ వివిధ రూపాల్లో నిరసన చేస్తూ వచ్చారు. ఉద్యోగభద్రత, కనీస వేతనం రూ.29 వేలు, హెచ్ఆర్‌సి పాలసీ అమలు చేయాలని, రిటైర్డ్ అయిన కార్మికులకు గ్రాడ్యూటీ ఇచ్చే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో పాల్గొన్న కార్మికులకు మున్సిపాలిటీ అధికారులు నోటీసులు అందజేశారు. కార్మికులు సమ్మెను వెంటనే విరమించి డ్యూటీకి హాజరు కావాలని నోటీసులు అందజేశారని కార్మికులు తెలిపారు. పి.రత్నం, శ్యామ్, కాశీ, వి.ఫణి, ఎం.సత్యనారాయణ, అధికారి మధు సుజాత, అను, ప్రసాద్, వాసు పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

భీమవరం : నినదిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - భీమవరం

కార్మికుల హక్కులను ఐక్య పోరాటాల ద్వారా కాపాడుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు పిలుపునిచ్చారు. హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం స్థానిక తటవర్తి భాస్కర్ షాపు వద్ద గురువారం నిర్వహిచారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడారు. ఈనెల 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 11 ఏళ్లలో కార్పొరేట్లకు రూ.16 లక్షల కోట్ల బ్యాంకు రుణాలు మాఫీ చేశారని, మరోపక్క పేద మధ్యతరగతి ప్రజలపై జిఎస్‌టి పేరుతో లక్షల కోట్ల భారాలు వేసారని విమర్శించారు. ఒక్క కొత్త పరిశ్రమ స్థాపించలేదని, ప్రభుత్వ పరిశ్రమలు మూతవేసి నిరుద్యోగం పెంచారన్నారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలు నాలుగు లేబర్ కోడ్లుగా తెచ్చి కార్మికులను నిలువు దోపిడీ చేస్తుందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు కాపాడుకోవడం కోసం మరో పోరాటానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.సత్యనారాయణ, రమేషు, సాంబ పాల్గొన్నారు.

భీమవరం : కేంద్ర ప్రభుత్వం రైతు, వ్యవసాయ కార్మికులు, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 9వ తేదీన జరిగే సమ్మె జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో రైతు సంఘం నేత తాళ్లూరి హరిహర లక్ష్మణ్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరే రామ్ మాట్లాడారు. ఈ సమావేశంలో గుత్తుల శ్రీరామచంద్రుడు, కిలారి తవిటి నాయుడు, చల్లబోయిన వెంకటేశ్వరరావు, చిర్ల పుల్లారెడ్డి, కొప్పిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

తణుకు : ఈనెల 9వ తేదీన జరిగే జాతీయ సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్‌కి సిఐటియు యూనియన్ నుంచి సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ కార్మికులు, ఉద్యోగులకు చాలా ప్రమాదకరమని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎ.కృష్ణబాబు, ఎన్.ఆదినారాయణ బాబు, ఎం.నాగేంద్రకుమార్, ఎన్.సురేష్, జి.పెద్దిరాజు, కె.పల్లపురావు, పి.జ్యోతిబాబు, ఎన్.శ్రీను, వి.రమేష్ పాల్గొన్నారు.

ఉండి : ప్రధాని నరేంద్ర మోడీ పాలనకు వ్యతిరేకంగా ఈనెల 9న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఒకరోజు సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్ అన్నారు. కార్మికులందరూ పాల్గొని సమ్మె విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడానికి ఎన్నేళ్లు?

హైవే నిర్వహణ అధికారులపై ఎంఎల్ఎ రాధాకృష్ణ ఆగ్రహం



ఫ్లై ఓవర్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

ఇంకా ఎంత మంది ప్రాణాలు తీస్తారు..? ప్రజల ప్రాణాలు పోతున్నా కనీసం మానవత్వం అంటూ లేదా..? హైవే నిర్వహణ అధికారుల పనితీరు కారణంగా రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది అంటూ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉండ్రాజవరం జంక్షన్ వద్ద హైవేపై జరుగుతున్న ఫ్లైవర్ నిర్మాణం కారణంగా అధికారుల నిర్లక్ష్య ధోరణితో ఎంతో మంది ప్రాణాలు పోతున్నాయంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో సర్వీసు రోడ్లపై బురద పేరుకుపోయి ప్రమాదాల్లో గతంలో పలువురు మృత్యువాత పడ్డారు. తాజాగా మంగళవారం రాత్రి సజ్జాపురం ప్రాంతానికి చెందిన దుర్గాప్రసాద్ అనే వ్యక్తి టిప్పర్ లారీ కింద పడి మృతి చెందడంతో ఎంఎల్ఎ రాధాకృష్ణ స్పందించారు. బుధవారం ఫ్లై ఓవర్ నిర్మాణం జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కనీసం క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని చూడకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎప్పటికి నిర్మాణం పూర్తవుతుందనే కనీస సమాచారం లేకపోవడం దారుణమన్నారు. బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని అన్నారు. గతంలో అనేక పర్యాయాలు అధికారులు, కాంట్రాక్టర్ దృష్టికి తీసికెళ్లినప్పటికీ నిర్మాణంలో జాప్యం జరుగుతోందన్నారు. ప్రణాళిక ప్రకారం నిర్మాణ పనులు జరగకపోగా సర్వీసు రోడ్లపై ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. హైవే నిర్వహణ విభాగం విజయవాడ ప్రాంతీయ అధికారితో ఫోనులో మాట్లాడి తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ముందుగా సర్వీసు రోడ్ల నిర్మాణం పూర్తిచేయాలని అధికారులను కోరినట్లు చెప్పారు. నిర్మాణ ప్రాంతాల్లో వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా, ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ సిబ్బందిని నియమించనున్నట్లు వెల్లడించారు. ఎంఎల్ఎ రాధాకృష్ణ వెంట తణుకు మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ప్రయివేట్ పాఠశాల బస్సు

తప్పిన పెను ప్రమాదం

విద్యుత్ స్తంభంపైకి దూసుకెళ్లిన బస్సు

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రయివేటు పాఠశాల బస్సు దూసుకెళ్లిన సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నరసాపురంలోని పాఠశాల నుంచి విద్యార్థులను రామన్నపాలెం తూర్పు తాళ్లు తదితర గ్రామాలకు తీసుకువెళ్తున్న ప్రయివేటు పాఠశాల బస్సు బుధవారం రామన్నపాలెం పంచాయతీ జట్టిపాలెం సమీపంలో రహదారి పక్కకు దూసుకు వెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో పలువురు విద్యార్థులు ఉన్నారు. ఈ ప్రమాదంలో విద్యార్థులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. దీంతో ట్రాఫిక్‌కి అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ జి.వాసు సిబ్బందితో సంఘటన ప్రాంతానికి చేరుకొని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. బస్సు 11 కెవి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభం, సపోర్టు స్తంభం ధ్వంసమైంది. ఎలక్ట్రికల్ ఎఇ ప్రభాకర్, లైన్‌మెన్ బాబ్జి సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేశారు. అనంతరం విద్యుత్‌ను పునరుద్ధరించారు. డ్రైవర్ నిర్లక్ష్యంతో వేగంగా బస్సు నడపడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

డేటా సైన్స్ లాబ్ ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం

శ్రీవైఎన్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన డేటా సైన్స్ లాబ్‌ను ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒఎన్‌జిసి వారు కళాశాలలో డేటా సైన్స్ లాబ్ ఏర్పాటుకు పది లక్షల రూపాయలు ఇవ్వడం వారి దాతృత్వానికి నిదర్శనమన్నారు. వారు ఇచ్చిన ఈ అవకాశాన్ని వినియోగించుకొని, బాగా చదువుకుని మీరు భవిష్యత్తులో మంచి స్థానాలలో స్థిరపడాలని, అందుకు మీరు బాగా చదవాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజమహేంద్రవరం ఒఎన్‌జిసి జిజిఎం.స్నేహల్ రాహుల్ కుండ్ మాట్లాడుతూ భవిష్యత్తు నిర్మాణానికి కావలసిన స్కిల్స్ నేర్చుకుని, భవిష్యత్ నిర్మాణం మనమే చేసుకోవాలని, దానికి ఇక్కడ నుండే ఆరంభించాలని, ఒక గమ్యాన్ని ఏర్పాటు చేసుకుని దానిని చేరుకోవడానికి మనం కష్టపడాలని, ఆ తరువాత సుఖ పడతామని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ రావు అధ్యక్షత వహించగా కళాశాల గవర్నింగ్ బాడీ సభ్యులు చేగొండి సత్యనారాయణ మూర్తి, ఆర్‌వి.సుబ్బారావు, కోటిపల్లి వెంకటేశ్వర రావు, రాజమహేంద్రవరం ఒఎన్‌జిసి ఎస్సెట్ సిజిఎం హెచ్‌ఆర్‌ఆర్ఎస్.రామారావు, చీఫ్ ఇంజనీర్ రాహుల్, పిడి సుధీర్, యూనియన్ అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీ కొడవటి సురేష్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతపల్లి కనక రావు, డాక్టర్ సిఎస్.రావు, పిజి సెంటర్ డైరెక్టర్ డాక్టర్ నిమ్మల చింతారావు, వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకటరత్నం, డాక్టర్ కెఎస్‌వి.రంగా రావు, డీన్ డాక్టర్ గంధం రామకృష్ణ, హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ డాక్టర్ చినిమిల్లి శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

గణపవరం : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు గణపవరం పిహెచ్‌సి పరిధిలోని స్కూల్ విద్యార్థులకు బుధవారం హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ కె.ఓంకార్ నాద్ తెలిపారు. బరువు, ఎత్తు పరీక్షలు కూడా చేసినట్లు చెప్పారు.

లయన్స్ నూతన కమిటీ ఎన్నిక

గణపవరం : ఈనెల 5వ తేదీన గణపవరం లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఎన్నుకుంటున్నట్లు అధ్యక్షులు వెల్లంకి నరేష్ బుధవారం చెప్పారు. సరిపల్లె క్లబ్ కార్యాలయంలో జరిగే సమావేశానికి లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ, నాయకులు ఎం.శ్రీరామ సురేష్ హాజరౌతారని తెలిపారు.

5న ఆందోళనలు జయప్రదం చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

భీమవరం టౌన్ : స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ ఛార్జీలు, విద్యుత్ ఛార్జీల పెంపు, అదానీతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను నిరసిస్తూ ఈనెల 5న చేపట్టిన ఆందోళనలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జరిగిన సిపిఐ భీమవరం పట్టణ 25వ మహాసభలో కోనాల ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ మహాసభ సిపిఐ పట్టణ సమితి సభ్యుడు వై.వి.ఆనంద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ కార్మిక చట్టాలను కాలరాస్తూ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న జాతీయ స్థాయిలో కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త కార్మిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని, ఆగస్టు 6, 7 తేదీల్లో ఉండిలో జరుగునున్న సిపిఐ 27వ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని కోనాల శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శిగా చెల్లబోయిన రంగారావు, జాయింట్ సెక్రటరీగా మల్లుల శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా వై.వి.ఆనంద్, కిలారి మల్లేశ్వరరావు, పోతుల యాకోబు, పాలా త్రిమూర్తులు, నీలాపు శ్రీను తదితరులతో పట్టణ సమితి ఏకగ్రీవంగా ఎన్నికైంది.

జనతా ట్రస్ట్ మండల కమిటీ ఎన్నిక

ఆచంట : ట్రస్ట్ కమిటీ స్వచ్ఛందంగా సమాజ సేవ చేసి ట్రస్ట్ కీర్తి ప్రతిష్టలు పెంచాలని జనతా ట్రస్ట్ ఫౌండర్ ప్రెసిడెంట్ పారుపల్లి యేసు రత్నం అన్నారు. ఆయన అధ్యక్షతన మండల శాఖ నూతన కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆచంట మండల శాఖ ప్రెసిడెంట్ కోరం రమేష్ బాబు, వైస్ ప్రెసిడెంట్ సదమ్మ సంతోష్ కుమార్, సెక్రెటరీ కుసుమే వినోద్, జాయింట్ సెక్రెటరీ గంటి బాబురావు, ట్రెజరర్ ఎస్.మహిమ రాజు, జాయింట్ ట్రెజరర్ పోతు రవి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెన్నపు ప్రకాష్, ఎడ్ల రత్నరాజు, గుండె నరేష్, గొట్టుముక్కల ఏసురత్నం, చొప్పల ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను జనరల్ సెక్రెటరీ పి.బాబూరావు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.రత్నరాజు, ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు లయన్స్ క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ఉండి : శ్రీకాసమరాజు అప్పలరాజు, సీతమ్మ లయన్స్ ఆడిటోరియంలో లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు తెత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు బుధవారం తెలియజేశారు. క్లబ్ నూతన అధ్యక్షులుగా డాక్టర్ గాదిరాజు రంగరాజు, కార్యదర్శిగా పెన్మెత్స రంగప్రసాదరాజు, కోశాధికారిగా పెన్మెత్స వెంకట జగన్నాధరాజు ఎన్నికైనట్లు వారు తెలిపారు. వీరితో పాటు ఎన్నికైబాడ్డ 10 మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేయనున్నారని వారు తెలిపారు.

వీర పేరంటాలమ్మ హుండీ లెక్కింపు

ఉండి : మండలంలోని వెలివర్రు గ్రామంలో వేంచేసియున్న వీర పేరంటాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి, తనిఖీదారు వి.వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దల సమక్షంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి తోట శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఐదు నెలల 20 రోజుల తర్వాత జరిగిన హుండీ లెక్కింపు కార్యక్రమంలో రూ.7,06,798 వచ్చినట్లు ఆయన తెలియజేశారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు డి.వి.కృష్ణంరాజు, ఎం.వి.రామాంజనేయ రాజు, ఆలయ ఛైర్మన్ గాదిరాజు వెంకట్రాజు, మాజీ ఛైర్మన్ రంగరాజు, ముదునూరి వీర్రాజు, ముదునూరి రంగరాజు పాల్గొన్నారు.

పెనుగొండ : పెనుగొండ గ్రామంలో వేంచేసియున్న శ్రీనగరేశ్వర శ్రీమహిషాసుర మర్దిని, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో దేవదాయ ధర్మదాయ శాఖ, తణుకు వారి పర్యవేక్షణలో 100 రోజులకు గాను హుండీలు తెరిచి ఆదాయం లెక్కించారు. రూ.5,76,505లు ఆదాయం రాగా, అన్నదాన హుండీ ద్వారా రూ.25,626లు వచ్చినట్లు కార్యనిర్వహణ అధికారి గుబ్బల రామ్, పెద్దింట్ల తెలిపారు.

యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్‌పై అవగాహన

పాలకొల్లు : స్థానిక శ్రీ దేవళ్ల సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, డైరెక్టర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ వారి ఆదేశాల అనుసరించి యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్(వైఎఫ్‌ఎస్‌ఐ) ప్రోగ్రాంపై అవగాహన కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం, యువత శక్తిని ఎలా ఎదగాలో, ఎలాంటి నైపుణ్యాలు పెంపొందించుకుంటే జీవితాల్లో స్థిరపడవచ్చో తద్వారా తనంతట తానే వ్యాపారాభివృద్ధి చేసుకుంటూ మిగిలిన వారికి జీవనోపాధి కల్పించవచ్చో ఎలాంటి మెళకువలు నేర్చుకోవాలో తెలుపుతున్నారు. యువత సరికొత్త ఆవిష్కరణలను సాధించే విధంగా ఈ ప్రోగ్రాం ఒక వేదిక కాగలదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ టి.శ్రీ ఐక్యూఏసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం, డిసిప్లిన్ కమిటీ కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట స్వామి, వైఎఫ్‌ఎస్‌ఐ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

వీడిన మృతదేహం మిస్టరీ

స్నేహితుడే నిందితుడు : ఎస్‌పి

నరసాపురం : మండలంలోని కొప్పర్రు పంటకాలువలో ఈ ఏడాది జనవరిలో కొట్టుకొచ్చిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మిస్టరీ వీడింది. తాలూకా పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే దర్యాప్తులో మృతుడి ఒంటిపై గాయాలు ఉండటంతో హత్య అని తేలడంతో నిందితుడ్ని అరెస్టు చేశారు. సెల్ ఫోన్, కాల్ డేటా రికార్డ్ లాకుల వద్ద లభ్యమై చెప్పిన వివరాల ఆధారంగా కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి నయీం అస్మి బుధవారం డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలంలోని గ్రామానికి చెందిన ముక్కల శ్రీనివాస్ మృతదేహం ఈఏడాది జనవరి 27న కొప్పర్రు పంట కాల్వలో లభ్యమైంది. అయితే అప్పటికే బాగా కుళ్లిపోవడంతో గుర్తించలేకపోయారు. శరీరంపై కత్తిగాయాలు ఉండటంతో హత్యగా భావించి దర్యాప్తు చేపట్టారు. పాలకొల్లు, కడియం, మార్టేరు లాకుల వద్ద పోలీసులు మృతదేహంపై పశ్చిమ, తూర్పు, కోనసీమ జిల్లాల్లో 15 పోలీస్ స్టేషన్లలో ఆరా తీశారు. అయితే పెరవలి దాటిన తరువాత కొట్టుకొచ్చినట్లు విచారణలో తేలింది. సెల్ సిగ్నల్, మిస్సింగ్ కేసుల ఆధారంగా మృతుడు పెరవలి మండలం నడిపల్లికి చెందిన ముక్కల శ్రీనివాస్‌గా గుర్తించారు. చివరి సారి అతనికి ఫోన్ ఇదే మండలానికి చెందిన పూల వ్యాపారి మల్లిపూడి శ్రీనివాస్ నుంచి వచ్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితుడు, మృతుడు మంచి స్నేహితులు. మృతుడు రాజమండ్రిలో డిఎస్‌సి కోచింగ్ వెళ్లడంతో నిందితుడు చెప్పిన వివరపోవడంతో ఇద్దరి మధ్య గ్రామం నుంచి ద్విచక్ర వాహనం(సుజుకి యాక్సెస్)పై బయలుదేరారు. పెరవలి వెళ్లే మార్గంలో కోచింగ్ విషయమై ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. నిందితుడు మృతుడిని ఏకలెవీ సమీపంలోని సీ షాప్ ఫ్యాక్టరీ వద్ద నిర్మానుష్య ప్రాంతంలో తీసుకెళ్లి రాత్రి 8:30 ప్రాంతంలో మళ్లీ వాగ్వాదం ప్రారంభించారు. ఆ సమయంలో నిందితుడు ఆక్రోశంలో ఒక బీరు సీసా పెంకుతో మృతుడి కడుపు కుడివైపున పొడిచి హత్యచేశాడు. హత్య చేసిన తర్వాత నిందితుడు మృతుడి కాళ్లు, చేతులను ఫోమ్ షీట్ తాడుతో కట్టి, దుస్తులను తీసివేసి, మృతదేహాన్ని పెరవలి కాలువలో పడేశాడని ఒప్పుకున్నాడన్నారు. ఈ కేసు ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన నరసాపురం రూరల్, పాలకొల్లు రూరల్, పోడూరు, పెరవలి ఎస్‌ఐలకు ఎస్‌పి ప్రశంసాపత్రాలందించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్‌పి భీమారావు, డిఎస్‌పి శ్రీవేద, సిఐ దుర్గాప్రసాద్, ఎస్‌ఐ టి.వెంకట సురేష్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

నరసాపురం : మద్యం సీసాలు కొనుగోలు చేసి వాటిలో మద్యం, నీళ్లు కలిపి విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 15 లీటర్ల నీళ్లు కలిపిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎక్సైజ్ సిఐ ఎ.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం మొగల్తూరు మండలం ముత్యాలపల్లి మోడీకి చెందిన ఎ.శ్రీనివాస్ పది లీటర్ల మద్యాన్ని కొనుగోలు చేశాడు. కోనసీమ జిల్లా నుంచి మద్యం సీసాలు తెచ్చి వాటిలో నీళ్లు, కొనుగోలు చేసిన మద్యాన్ని కలిపి చిల్లరగా విక్రయించేందుకు పాల్పడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. దీనిపై సిఐ దాడి చేసి అరెస్టు చేయగా అతని వద్ద 15 లీటర్ల మద్యం దొరికిందని తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అధ్వానంగా ఉన్న ఉల్లంపర్రు పరిధిలోని ఆదిత్య స్కూల్ ఆవరణ రోడ్డు



ఆరు బయటే నిలిపిన సైకిళ్ళ్

ప్రయివేటు స్కూళ్లల్లో ఫీజులు ఘనం.. సౌకర్యాలు శూన్యం..!

అధ్వానంగా స్కూల్ ఆవరణ రహదారి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ప్రయివేటు స్కూళ్లలో ఫీజులు ఘనం.. సౌకర్యాలు శూన్యం అన్న చదంగా తయారయ్యాయి. స్కూల్ ఆవరణ పరిధిలో చిన్నపాటి వర్షానికి నీళ్లు నిలబడి మురికిగుంటలతో దర్శనమిస్తున్నాయి. స్కూలు లోపలికి ప్రవేశించాలంటే ఆ మురికి నీటిలో నుండి వెళ్లాలి. స్కూలుకు వచ్చే విద్యార్థుల సైకిళ్లు ఆరు బయటపెట్టి వెళ్లాలి. వాటికి వర్షం నుండి గాని, ఎండ నుంచి గాని ఎలాంటి రక్షణ ఉండదు. ఎండకు ఎండి వానకు తడుస్తున్నాయి. ఫీజులు వసూలు చేసే శ్రద్ధ విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలో చూపించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రయివేటు స్కూళ్లలో పుస్తకాలు, యూనిఫామ్ వంటివి అమ్మకూడదని నిషేధం ఉన్న ఏమాత్రం పట్టించుకోవడం లేదు. యధేచ్ఛగా అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఎక్కడా ప్రభుత్వాధికారులు పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తొలి అడుగుతో మరింత సంక్షేమం, అభివృద్ధి : టిడిపి



తణుకులో..

ప్రజాశక్తి - తణుకు

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సుపరిపానకు తొలి అడుగు కార్యక్రమం ద్వారా మరింత సంక్షేమం, అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం అత్తిలి మండలం కె.సముద్రపుగట్టు గ్రామంలో ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అందుతున్న సంక్షేమం, అభివృద్ధి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్ఫూర్తితో తణుకు నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమాన్ని అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. నియోజకవర్గ పరిశీలకులు ప్రకాష్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసాపురం: ఏడాది కూటమి పాలనలో రాష్ట్ర ప్రజలు చాల సంతోషంగా ఉన్నారని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. బుధవారం మండలంలోని గొంది, చిట్టవరం, పట్టణంలోని 1వ వార్డు లాకుపేట గ్రామాల్లో టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార సహకార సంఘాల సమైఖ్య ఛైర్మన్ కొల్లు పెద్దిరాజులతో కలిసి తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాలనపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచి మద్దాల అంజిబాబు, వైఎస్.నాగేశ్వరరావు, జక్కం శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

నరసాపురంలో..

ఆచంట : ఆచంట నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తనయుడు వెంకట సురేష్ వల్లూరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, వైస్ ఎంపిపి తాళం శ్రీను, టిడిపి సీనియర్ నాయకులు కేతా మీరయ్య, టిడిపి గ్రామ అధ్యక్షులు దేవళ్ల రమేష్, మాధవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరవాసరం : టిడిపి కూటమి ప్రభుత్వం పాలన ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా చేపట్టిన తొలి అడుగు కార్యక్రమం బుధవారం నేలపోగులలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు పథకాల అమల తీరును ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్, వీరవల్లి శ్రీనివాసరావు, కడలి నెహ్రూ, ఎరక రాజు గోపాలకృష, రాజులు పాల్గొన్నారు.



ఆచంటలో..

భీమవరం టౌన్ : కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమాభివృద్ధి అని నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరం పట్టణ టిడిపి అధ్యక్షుడు మద్దులు రాము అధ్యక్షతన భీమవరం 6వ వార్డు బొక్కవారిపాలెం రామాలయం వద్ద నుంచి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మెరగాని నారాయణమ్మ, మామిడిశెట్టి ప్రసాద్, ఇందుకూరి రామలింగరాజు, మైలాబత్తుల ఐసాక్ బాబు, మాదాసు కనకదుర్గ, సయ్యద్ నసీమా బేగం, ఎండి షబీనా, గంధం రాధ, సునీత, అంబల్ల జోగేశ్వరి పాల్గొన్నారు.

సేవా దృక్పథంతోనే ఆనందం

వైద్యాధికారి దిగుపాటి జితేంద్ర

ఆచంట : లాభాపేక్షతో కాకుండా సేవా దృక్పథంతో పనిచేస్తే ఆనందం, సంతృప్తి కలుగుతుందని పాలకొల్లు జితేంద్ర హాస్పిటల్ వైద్యాధికారి దిగుపాటి జితేంద్ర అన్నారు. అమరవీరులు నెక్కంటి రామదాసు, అన్నపూర్ణ విజ్ఞాన సేవా కేంద్రం ఆధ్వర్యంలో పాలకొల్లు జితేంద్ర హాస్పిటల్ వారి సౌజన్యంతో బుధవారం ఆచంట మండలం అయోధ్య లంక పంచాయతీ పరిధి పుచ్చలంక గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో సుమారు 65 మంది వరకు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్ జితేంద్రను ప్రజాసంఘాల నాయకులు ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పి.మోహన్ రావు, తలుపూరి బుల్లబ్బాయి, కుసుమే, జయరాజు బండి రంగారావు, సరేళ్ల రాధాకృష్ణ, మట్టపర్తి వీరాంజనేయులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది వినియోగించుకోవాలి

ఎడిఎ ఆర్.గంగాధర్

తాడేపల్లిగూడెం : రైతులకు సాగులో మెలకువలు తెలియజేస్తూ విత్తన మార్పిడి, ప్రభుత్వ పథకాలు తెలియపరిచే విధంగా నిర్వహించే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాడేపల్లిగూడెం సహాయ సంచాలకులు ఆర్.గంగాధర్ సూచించారు. మండలంలోని చిన్న తాడేపల్లి, కొండ్రప్రోలు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి వి.నారాయణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న టిడిపి మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అందిస్తోందని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం సూచించిన వరి రకాలను మాత్రమే సాగు చేయాలని సూచించారు. ముఖ్యంగా గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన సబ్సిడీపై యంత్రాల అందజేత కార్యక్రమాన్ని పునరుద్ధరించామన్నారు. ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి రెడ్డి విద్యాసాగర్ పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌కు ఫ్యాన్ బహూకరణ

గణపవరం : గణపవరం వెలంపేటలో ఉన్న ఎస్‌సి బాలికల హాస్టల్‌కి స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీలింగ్ ఫ్యాన్‌ని హాస్టల్ వార్డెన్ సూర్యకళకి క్లబ్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వెల్లంకి నరేష్, కిలారి రవిబాబు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో గణపవరం, నిడమర్రు మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా వాణిఫ్యాన్స్ యజమాని వంకాయల నాగ వెంకటకృష్ణ అందజేసిన రూ.4 వేల ఫ్యాన్‌ని కొనుగోలు చేసి హాస్టల్ వార్డెన్‌కు అందజేసినట్లు తెలిపారు. క్లబ్ కోశాధికారి కెఎస్ఎన్.మూర్తి, రావూరి నాగరాజు, ఎండి అబ్దుల్ గపూర్ ఖాన్ పాల్గొన్నారు.

ఉచిత కుట్టు మిషన్ శిక్షణను వినియోగించుకోవాలి

కాళ్ల : మహిళలు ఉచిత కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను పొందాలని డిప్యూటీ స్పీకర్ తనయుడు కనుమూరు భరత్ పేర్కొన్నారు. కాళ్ల ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహం సముదాయంలో బిసి ఫైనాన్స్ కార్పొరేషన్, ఇడబ్ల్యూఎస్ సహకారంతో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. మండలంలో 144 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఆరేటి వెంకటరత్న ప్రసాద్, సర్పంచి బందా విజయ, పెంటపాటి వెంకట నాగేశ్వరరావు, ఇఒపిఆర్‌డి భాస్కరరావు, తహశీల్దార్ సుందర్ సింగ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉండి: బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఉండి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, కనుమూరి భరత్ అన్నారు. బుధవారం ఉండి ఏకలవ్య కమ్యూనిటీ హాలులో ఏర్పాటుచేసిన ఉచిత శిక్షణ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా జుత్తిగ నాగరాజు, కనుమూరి భరత్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉండి డిసి వైస్ చైర్మన్ మంతెన సాయి లచ్చిరాజు, టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఆచంట : ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీల్లో భాగంగా స్వయం శక్తితో మహిళలు ఎదిగేందుకు ప్రభుత్వం ఉచిత కుట్టు మిషన్ల శిక్షణ ఇస్తుందని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తనయుడు వెంకట్ సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని వల్లూరు లో వెనుకబడిన తరగతుల సహకార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు మిషన్ల శిక్షణ(టైలరింగ్) శిబిరాన్ని పితాని తనయుడు వెంకట్ సురేష్ ప్రారంభించారు. ఎంపిడిఒ కృష్ణమోహన్, ఆచంట ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, వైస్ ఎంపిపి తాళం శ్రీను పాల్గొన్నారు.

ప్రశాంతతోనే ఆరోగ్యం

11 మంది డాక్టర్లను సత్కరించిన జె కామ్ భీమవరం సభ్యులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆరోగ్యమే మహా భాగ్యమని, మనసును ప్రశాంతంగా ఉంచుకుంటే ఎప్పుడూ ఆరోగ్యంగానే ఉంటామని జె కామ్ భీమవరం ఛైర్మన్ పెరుమాళ్ల రామ్మోహన్ రావు, వైస్ ఛైర్మన్ పేరిచర్ల కృష్ణంరాజు అన్నారు. బుధవారం భీమవరం ఫాల్కన్ నెస్ట్ హోటల్లో బుధవారం జె కామ్ భీమవరం ఆధ్వర్యంలో డాక్టర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించి 11 మంది వైద్యులను సత్కరించారు. రామ్మోహన్ రావు, కృష్ణంరాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని అన్నారు. సత్కార గ్రహీతలు మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి శ్రద్ధ వహించాలని, వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఆరోగ్య విషయంలో వైద్యుల సలహాలు, సూచనలు తప్పకుండా పాటించాలని, ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమేనని వారు అన్నారు. అనంతరం పట్టణంలోని 11 మంది వైద్యులను జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో జె కామ్ భీమవరం సెక్రటరీ మధుబాబు, ట్రెజరర్ బొండాడ కృష్ణకాంత్, కోచ్ సంతోష్, కాలపు సాయి లక్ష్మి, సభ్యులు డాక్టర్లు పాల్గొన్నారు.

డాక్టర్‌ను సత్కరిస్తున్న జె కామ్ సభ్యులు

కంపోస్ట్ పిట్స్ నిర్మాణానికి చర్యలు : ఎంపిడిఒ

ఆచంట : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో 1800 కంపోస్ట్ పిట్స్ నిర్మాణం చేయాల్సి ఉన్నందున ఆ దిశలో చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ ఆదేశాలు జారీ చేశారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ చట్టం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు ఎపిఎం, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీలు వారీగా ఉపాధి హామీ సిబ్బంది వెలుగు సిబ్బందికి ఆయా గ్రామాలలో కుటుంబాలు ఆధారంగా లక్ష్యాలు నిర్దేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మూడు రోజుల్లో లబ్ధిదారుల పేరు, ఆధార్, జాబ్ కార్డ్, బ్యాంక్ ఖాతా వివరాలు సేకరించాలని, ఇంటి వద్ద 5 అడుగుల వెడల్పు, 5 అడుగుల పొడుగు, 3 అడుగుల లోతు తో తవ్వుకుంటే ఈ పిట్‌లో తడి చెత్త వ్యవసాయ వ్యర్థాలతో నింపుకుంటే కంపోస్ట్ ఎరువుగా మారి ఉద్యానవన పంటలకు వాడుకోవచ్చని తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పించి త్వరగా మండల లక్ష్యం 1800 కంపోస్ట్ పిట్స్ నిర్మాణం పూర్తిచేయాలని సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎపిఎంసిహెచ్.పెద్దిరాజు, టిఎ సత్యనారాయణ, సిఒ రాజేష్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మానవత మండల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పెనుమంట్ర

మానవతా శాఖ మండల నూతన కార్యవర్గం ఎన్నికైనట్లు బుధవారం జిల్లా మానవతా శాఖ ప్రతినిధి కొత్త సత్యనారాయణ మూర్తి ఇక్కడ తెలిపారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఈనెల 4వ తేదీ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మార్టేరులోని శ్రీగౌరీ శంకర దేవాంగుల కళ్యాణమండపంలో జరుగుతుందని ఆయన తెలిపారు. ఈమేరకు ప్రెసిడెంట్‌గా శిరం విశ్వనాథం, సెక్రెటరీగా బండి ప్రసాద్, ట్రెజరర్‌గా అమృతవాక్కుల సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్‌గా చదువుల వెంకట నరేంద్ర, జాయింట్ సెక్రెటరీగా చిర్ల వంశీ హరినాథ్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈసీ హెల్త్ ప్రతినిధిగా పడాల రామచంద్రారెడ్డి, ఈసీ ఎడ్యుకేషన్ ప్రతినిధిగా పి.సువర్ణగౌరి, ఈసీ ఏవేర్నెస్ ప్రతినిధిగా కడలి పరమేశ్వరి, ఈసీ ఎమర్జెన్సీ ప్రతినిధిగా జిఎస్ఎస్.ప్రసాద్ రెడ్డి నూతన కార్యవర్గంగా ఎన్నికైనట్లు ఆయన పేర్కొన్నారు.

అధ్యక్షులు శిరం విశ్వనాథం, కార్యదర్శి ప్రసాద్

ఘనంగా సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - తణుకు

ప్రపంచవ్యాప్తంగా సాల్వేషన్ ఆర్మీ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ వ్యవస్థాపకులు విలియమ్ బూత్ ఎంతో మందికి స్ఫూర్తి నింపారని తణుకు ఎంఎల్ఎ రాధాకృష్ణ సతీమణి ఆరిమిల్లి కృష్ణతులసి పేర్కొన్నారు. సాల్వేషన్ ఆర్మీ స్థాపించి 160 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా స్థానిక రైల్వే స్టేషన్‌రోడ్డులోని బాలికల వసతి గృహంలో బుధవారం ఏర్పాటు చేసిన వేడుకల్లో కృష్ణ తులసి పాల్గొని మాట్లాడుతూ 1865లో విలియం బూత్ సాల్వేషన్ ఆర్మీ సంస్థను స్థాపించి సేవా దృక్పథంతో ప్రపంచ వ్యాప్తంగా ఆయన చేపట్టిన సేవా కార్యక్రమాలు ఎంతో మందికి స్ఫూర్తి అన్నారు. నిరుపేదలు, అనాథలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ మరోవైపు ఏసుక్రీస్తు బోధనలు అందరికీ పంచుతూ ప్రతిఒక్కరిలో సేవాతత్పరతను నింపేవిధంగా కృషి చేశారన్నారు. అనంతరం వసతిగృహంలోని విద్యార్థులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. తొలుత విలియమ్ బూత్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏటా నోటు పుస్తకాలు అందిస్తాం

సత్యసాయి సేవాసమితి సభ్యులు శశిశేఖరరావు

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో పాఠశాల విద్యార్థులకు ప్రతి ఏడాది నోటు పుస్తకాలను ఉచితంగా అందజేస్తామని సత్యసాయి సేవాసమితి సభ్యులు కానుమిల్లి శశిశేఖరరావు అన్నారు. బుధవారం ముప్పర్తిపాడులో ఉన్న రెండు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు రూ.40 వేల విలువగల నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచి కర్రి రాధలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి సత్యసేవా సమితి చేస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా దాత బదిరి నారాయణ, గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ మార్కెట్ పాట ఖరారు

నరసాపురం : ఎట్టకేలకు మున్సిపల్ మార్కెట్ పాట ఖరారైంది. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్లో నిర్వహించిన పాటలో నలుగురు పాటదారులు ధరావత్తు కట్టి పాటలో పాల్గొన్నారు. ప్రారంభ ధర రూ.37 లక్షలుగా నిర్ణయించారు. ప్రారంభ ధర కంటే కేవలం రూ.1.16 లక్షల హెచ్చు మొత్తంలో గంటా నాగ దుర్గా భవాని పాటను పాడారు. మిగిలిన వారెవ్వరూ ఆసక్తి చూపించలేదు. గతంలో ఇదే పాటదారుడు రూ.25 లక్షలకు పాడారు. అప్పుడు పాటను ఖరారు చేయలేదు. ఇప్పటి వరకు పాటను ఏడుసార్లు నిర్వహించారు. ప్రస్తుతం పన్ను వసూలు మున్సిపల్ సిబ్బంది చేపడుతున్నారు. దీనివల్ల పూర్తి స్థాయిలో పన్ను రావడం లేదు. ఈనేపథ్యంలో గురువారం జరిగే కౌన్సిల్ సమావేశంలో దీనిపై సభ్యులు ఏవిధంగా ఏ నిర్ణయం తీసుకుంటారోనని ఆసక్తికరంగా మారింది. ఈ సమావేశంలో కమిషనర్ అంజయ్య, ఆర్ఐ కృష్ణమోహన్, ఘంటా కృష్ణ, జి.సతీష్, చిట్టూరి కృష్ణ, రాచినపూడి ఎన్‌వి.ప్రసాద్, భూపతి సురేష్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై సమీక్ష

వీరవాసరం : నిర్దేశించుకున్న లక్ష్యానికి అనుగుణంగా పారిశుధ్య నిర్వహణ ఉండాలని డిపిఒ ఎన్.రామనాథ్ రెడ్డి అన్నారు. డిపిఒ ఆకస్మిక పర్యటనలో భాగంగా బుధవారం వీరవాసరం పంచాయతీకి విచ్చేశారు. ఈ సందర్భంగా వివిధ విషయాలపై అధికారులతో సమీక్షించారు. 100 శాతం పన్నుల వసూలు పూర్తిచేయాలని అన్నారు. రోడ్లు వెంబడి బహిరంగ ప్రదేశాలలో స్థానికులు చెత్త వేయకుండా అవగాహన కలిగించి అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. తాను ఆకస్మిక పర్యటనలతో పంచాయతీల స్థితిగతులపై పరిశీలిస్తామన్నారు. తాగునీరు సరఫరాలో భాగంగా ఒ.హెచ్.ఆర్.ఒను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని, ఏమైనా లోపాలు గుర్తిస్తే సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. పంచాయతీ ఇఒపిఆర్‌డి ఫణికుమార్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ అప్పారావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి ఉన్నారు.

CHANGE OF NAME

I, **PAMULA RAVI PRASAD** S/o. Pamula Purushottam, D.No.6-11/1, Jettipalem, Ramanna Palem Post, Mogalthur Mandal, W.G.Dt. I have changed my name from **PAMULA RAVIKUMAR** (Old name) to **PAMULA RAVI PRASAD** (New name) hence forth I am being called **PAMULA RAVI PRASAD** S/o. Pamula Purushottam, for all purposes.

CHANGE OF NAME

I, **BOMMADEVERA SRI RAMA VEERA VENKATA KUMAR YETHIRAJULU**, S/o. B. Raghavarao Venkata Varaprasad rayulu Resident of D.No. 23a-7-19, KKS Street, above ICIC Bank, R.R.Pet, Eluru Town & Mandal, Eluru district, A.P. I have changed my name from **BOMMADEVARA SRI RAMA VEERA VENKATA KUMARA YETHIRAJULU** (Old name) To **BOMMADEVERA SRI RAMA VEERA VENKATA KUMAR YETHIRAJULU** (New name) for all practical purposes.

పాస్‌పోర్ట్ పోయినది

ఏలూరు జిల్లా, పెదవేగి మండలం, కె.కన్నాపురం గ్రామానికి చెందిన పాల హరికృష్ణ, తండ్రి: వెంకటేశ్వరరావు అను నేను ది. 22-06-2025 వ తేది ఏలూరు వ్యక్తిగత పనులపై వెళ్ళి తిరిగి కె.కన్నాపురం వస్తుండగా సాయంత్రం గం. 5-30 ని॥లకు ముందూరు - ఏడవమైలు మధ్య నా బ్యాగు జారి పడిపోయింది. అందులో గల నా పాస్‌పోర్ట్ నెంబర్: **N1720895** కూడా జారి పడింది. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

పాల హరికృష్ణ
తండ్రి: వెంకటేశ్వరరావు
కె. కన్నాపురం గ్రామం,
పెదవేగి మండలం,
సెల్ నెం: 77807 24749

జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ

'e' ప్రొక్యూర్మెంటు టెండర్ నోటీసు

ఆర్.ఓ.సి. నెం. 39/2025-ఇ.1. **ది. 02-07-2025**

జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఈ దిగువ తెలిపిన పనులు చేపట్టుటకు 'ఇ' ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండరులు పిలువబడుచున్నది.

వ.నెం.	పని వివరము	పనుల సంఖ్య	ECV (రూ.లక్షలలో)
1	జంగారెడ్డిగూడెం పురపాలక సంఘ పరిధిలోని వివిధ వార్డులలో అభివృద్ధి పనులు రోడ్లు & డ్రైన్లు వేయుట	6	53.5

సంబంధిత వివరములు **https:\tender.epeprocurement.gov.in** వెబ్ సైటు నందు ది. 03-07-2025 వ తేది ఉదయం గం. 10-00 ల నుండి చూడవచ్చును. ఇతర వివరములకు మున్సిపాలిటీ కార్యాలయము, ఇంజనీరింగ్ విభాగము నందు సంప్రదించగలరు.

సం/- **కమీషనర్**
జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ.